# చట్ట నిర్మాణం (రూల్ 90-148)

## ఉపోద్ఘాతం :

ప్రస్తుత వ్యవస్థలో చట్టాలు, శాసనాలు ప్రజలకు ఉపయోగార్ధం సంకల్పించారు. ప్రజలందరికి ఉత్తమ జీవితాన్ని అందించటమే వాటి లక్ష్యం. ప్రజల కష్ట సుఖాలను నివారించి, ప్రస్తుత వ్యవస్థలో అంటిపెట్టుకొని వున్న లోపాలను సవరించటం వాటి ఉద్దేశ్యం. ప్రజల పరిస్థితులను మెరుగుపర్చుటకై చర్యలను తీసుకొంటున్న రాష్ట్రాలలో గానీ, రాజ్యంలో గాని కొత్త చట్టాల, శాసనాల అవశ్యకత ఎంతైనా వుంది. రాష్ట్ర కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ శాసనాల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంటుంది. చిత్తు చట్టం (Bill) అనగా ముసాయిదా చట్టం అని అర్థం. ఒక చిత్తు చట్టం చట్టంగా రూపొందడానికి వివిధ దశలను అధిగమించాలి. చిత్తు చట్టాన్ని ప్రవేశ పెట్టుటకై సభానుమతిని కోరునట్టి సభ్యుడు లేక మంత్రి చిత్తుచట్టపు ప్రతిపాదక సభ్యుడు అంటారు.

## ప్రతిపాదనా నోటీసు : (రూల్ 90)

చిత్తు చట్టాన్ని ప్రవేశపెట్టుటకై సభానుమతిని కోరునట్టి సభ్యుడు ఆ చిత్తు చట్టాన్ని ప్రవేశపెట్టటానికి సభానుమతి నిమిత్తం ప్రతిపాదనా నోటీసును యివ్వాలి. ఆయన, ఆ చిత్తు చట్టపు ప్రతిని ఉద్దేశ్య కారణాల వివరణ పట్టికను అందచేయాలి.

## నోటీసు గడువు :

చిత్తు చట్టాన్ని ప్రవేశపెట్టుటకై సభానుమతి నిమిత్తం యిచ్చు ప్రతిపాదనా నోటీసు గడువు ఏడు



రోజులు, అనగా ప్రతిపాదన చేయునట్టి రోజుకు ముందు రోజుతో ఆ గడువు ముగియును.

## తీసుకొనవలసిన చర్యలు :

రాజ్యాంగ చట్టపు నిర్దేశాల ప్రకారం రాష్ట్రపతి మంజూరి లేక గవర్నరు సిఫారసు లేకుండా ప్రవేశపెట్టడానికి వీలులేని చిత్తు చట్టాల విషయంలో చిత్తు చట్టపు ప్రతిపాదక సభ్యుడు అట్టి మంజూరీని లేక సిఫారసును నోటీసుకు జతపర్చాలి. ఏ చిత్తుచట్టం చట్టంగా రూపొందిన మీదట వ్యయంను కలుగజేయునో, అట్టి చిత్తు చట్టాల విషయంలో ఆర్థిక వివరణను చట్టానికి జతపర్చాలి. ఆ వివరణలో ఏ ఏ ఖండాల ద్వారా ఆర్థిక వ్యయం జరుగునో అట్టి ఖండాలను ఆ వివరణలో పేర్కొనాలి. అనుగత చట్ట నిర్మాణాధికారాల వివరణను చిత్తుచట్టానికి జతపర్చాలి.

## సభానుమతికి నోటీసు :

చిత్తు చట్టాన్ని ప్రవేశపెట్టటానికి ప్రతిపాదక సభ్యుడు సభానుమతి పొందాలి. చిత్తుచట్టాన్ని ప్రతిపాదించటానికి అనుమతి నిమిత్తం చేసిన ప్రతిపాదనను సభ్యుడెవరైనా సభాపతి అనుమతితో వ్యతిరేకించిన ఎడల, సభాపతి తమకు ఉచితమని భావించిన ఎడల ఆయన ప్రతిపాదకుని అభిప్రాయాన్ని, ఆ ప్రతిపాదనను వ్యతిరేకించిన సభ్యుని అభిప్రాయాన్ని విని, ఆ విషయంపై ఎటువంటి చర్చకు తావీయకుండా దానిని సభానుమతికి పెట్టవచ్చును. సభాధికారాలకు అతీతంగా ఉండే విషయాలపై ఆ చిత్తు చట్టం ద్వారా శాసనం చేయ



యత్నించినట్లు ఆరోపిస్తూ దానిని ప్రతిఘటించిన ఎడల, దానిపై సమూలాగ్రంగా చర్చ జరపటానికి సభాపతి అనుమతించవచ్చును.

## గెజిట్లో ప్రచురణ :

చిత్తు చట్టాన్ని ప్రవేశపెట్టటానికి సభానుమతి లభించిన వెనువెంటనే ఆ చిత్తు చట్టాన్ని దాని ఉద్దేశ్య కారణాలతో గెజిట్ లో ప్రచురించాలి. చిత్తు చట్టాన్ని ప్రవేశపెట్టడానికి సభానుమతి నిమిత్తం ఎటువంటి ప్రతిపాదనను చేయనప్పటికీ, సభాపతి ఆ చిత్తు చట్టాన్ని దాని ఉద్దేశ కారణాలతో గెజిట్ లో ప్రచురించడానికి ఆదేశమివ్వవచ్చు. ఆ విధంగా ప్రచురితమైన చిత్తుచట్టాన్ని తర్వాత సభలో ప్రవేశపెట్టిన యెడల, దానిని తిరిగి ప్రచురించవలసిన అవసరం లేదు.

## చిత్తు చట్టాన్ని ప్రవేశపెట్టిన తర్వాత చేయవలసిన ప్రతిపాదనలు :

చిత్తుచట్టాన్ని ప్రవేశపెట్టిన తర్వాత, ఆ చిత్తు చట్టపు ప్రతిపాదక సభ్యుడు ఈ క్రింది ప్రతిపాదనలలో ఏదేని ఒక ప్రతిపాదన చేయాలి.

1. ఆ చిత్తు చట్టాన్ని సభ పరిశీలనకు తీసుకోవాలి, లేదా
2. ఆ చిత్తు చట్టాన్ని సభవారి సెలెక్టు కమిటీ అన్ని పరిశీలనకు పంపాలి, లేదా
3. ఆ చిత్తు చట్టాన్ని ప్రజాభిప్రాయ సేకరణకు పంపాలి.



ప్రతిపాదక సభ్యుడు ఆ చిత్తు చట్టాన్ని పరిశీలనలోనికి తీసుకొనవలెనని ప్రతిపాదించినప్పుడు, ఆ చిత్తుచట్టాన్ని సభవారి సెలెక్టు కమిటీకి గాని లేదా ప్రతిపాదనలో నిర్దిష్టపర్చిన తేదీకి ఆ చిత్తు చట్టంపై అభిప్రాయ సేకరణ కొరకు ఆ చిత్తు చట్టాన్ని పంపాలని ఏ సభ్యుడైన ఆ ప్రతిపాదనను సవరణకు ప్రతిపాదించవచ్చు.

ఆ ప్రతిపాదనను సభ ఆమోదిస్తూ, ఆ చిత్తు చట్టాన్ని సభ సెలెక్టు కమిటీకిగాని లేదా సందర్భానుసారంగా ప్రజాభిప్రాయ సేకరణకుగాని పంపుతారు. ఆ విధంగా చేయని పక్షంలో ఆ చిత్తు చట్టాన్ని పరిశీలనకు తీసుకుంటారు.

ఒక చిత్తు చట్టాన్ని సెలెకు కమిటీ పరిశీలనకు పంపేటప్పుడు ఆ విధంగా ప్రతిపాదన చేయాలి. ఆ సెలెక్టు కమిటీ సభ్యులను సభ నిర్ణయిస్తుంది. సెలెక్టు కమిటీలో సాధారణంగా ఏడు మందికి మించకుండా సభ్యులు ఉంటారు. చిత్తు చట్టపు ప్రతిపాదక సభ్యుడు ఆ కమిటీలో విధిగా కమిటీ సభ్యుడై ఉండాలి. ఆ కమిటీ అధ్యక్షున్ని సభాపతి నియమిస్తారు.

## కమిటి సమక్షంలో కార్యవిధానం : (రూల్ 102)

సెలెక్టు కమిటీలో జరిగే కార్యవిధానం చిత్తు చట్టపు పరిశీలనా దశలో సభయందు జరిగే కార్యవిధానాన్ని పోలి ఉంటుంది. కమిటీ చిత్తు చట్టాన్ని పరిశీలనకు తీసుకొనే రోజుకు ముందు రోజున ఆ కమిటీ సభ్యులు ఆ చిత్తు చట్టానికి సవరణల నోటీసులను ఇవ్వొచ్చు. సెలెక్టు కమిటీ

చిత్తుచట్టాన్ని ఖండాలవారీగా పరిశీలిస్తుంది. సభ్యులు ఖండాలకు సవరణలను ప్రతిపాదింపవచ్చు. కమిటీ చిత్తుచట్టాన్ని ఖండాలవారీగా పరిశీలించటానికి పూర్వం, ఆ చిత్తుచట్టానికి సంబంధించి ప్రమేయం ఉండే ప్రజాసంస్థలు, సంఘాలు, వ్యక్తులు లేదా నిపుణుల సాక్ష్యాలను కూడా సేకరించవచ్చు. ఆ విధంగా ఆయా వ్యక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాల, సాక్ష్యాల ద ృష్ట్యా కమిటీ ఆ చిత్తుచట్టాన్ని పరిశీలిస్తుంది. నివేదికను తయారు చేసి కమిటీ తాను భావించిన విధంగా చిత్తుచట్టాన్ని సవరించి సభకు సమర్పిస్తుంది. ఒకవేళ చిత్తుచట్టాన్ని ప్రజాభిప్రాయానికి పంపినట్లయితే ఆ విధంగా సేకరించిన ప్రజాభిప్రాయాన్ని సభ నిర్ణయించిన గడువులో దానిని సభా సభ్యులకు అందజేస్తారు.

### చిత్తు చట్టపు పరిశీలన :

సెలెక్టు కమిటీ నివేదించిన రూపంలో సభ ఆ చిత్తు చట్టాన్ని పరిశీలనలోకి తీసుకుంటుంది. ఆ విధంగా చిత్తు చట్టం పరిశీలనార్థం కమిటీకి పంపని యెడల సభలో చిత్తు చట్టాన్ని ప్రవేశపెట్టిన రూపంలో పరిశీలనకు తీసుకుంటుంది. ఆ చిత్తుచట్టంలోని నిర్దేశాలను చర్చించిన మీదట సభ ఆ చిత్తుచట్టపు పరిశీలనకు ఉద్దేశించిన ప్రతిపాదనను ఆమోదిస్తుంది.

### ఖండాలకు సవరణ : (రూలు 104)

చిత్తు చట్టపు ఖండాలకుగాని, లేదా అనుసూచికలకు గాని సవరణలను ఈయవచ్చును. ఈ సవరణల నోటీసులను సభ ఆ చిత్తుచట్టాన్ని పరిశీలనకు తీసుకునే రోజుకు ముందు రోజు శాసనసభ కార్యదర్శికి అందజేయాలి. నిర్ణీత కాలంలో అందిన సవరణలను సభాపతి ఆమోదించిన పిమ్మట వాటిని సభ్యులకు అందజేస్తారు. చిత్తు చట్టపు ఖండాలను పరిశీలించేటప్పుడు ఆయా ఖండాలు చర్చకు వచ్చినప్పుడు వాటి వరుసలో సవరణలను పరిశీలిస్తారు.

### ఖండాలవారీగా చిత్తుచట్టపు పరిశీలన : (రూలు 117)

చిత్తు చట్టాన్ని పరిశీలనలోకి తీసుకోవాలన్న ప్రతిపాదనను సభ ఆమోదించిన తర్వాత, సభ్యులు తామిచ్చిన సవరణలను ప్రతిపాదిస్తారు. ఆ పిమ్మట సభాపతి చిత్తుచట్టపు ఖండాలను వరుసగా పరిశీలిస్తారు. ప్రతి ఖండానికి యిచ్చిన సవరణలను ముందుగా ఓటింగుకు పెట్టి ఆ తర్వాత చిత్తు చట్టపు ఖండాన్ని ఓటింగుకు పెడ్తారు. సవరణలలో దేనినైనా సభ ఆమోదించినట్లయితే, సవరించిన విధంగా ఆ ఖండాన్ని ఓటుకు పెడ్తారు. సభానుమతిని పొందిన తర్వాత ఆ ఖండం చిత్తు చట్టంలో అంతర్భాగంగా రూపొందుతుంది. ఖండాలు, వాటి తర్వాత చిత్తు చట్టంలో అనుసూచికలు, మొదటి ఖండాన్ని అటుపై శాసనసూత్రాన్ని ప్రస్తావన ఉన్నదానిని, చిత్తుచట్టపు పేరున ఓటుకు పెడ్తారు.

### చిత్తు చట్టపు ఆమోదం : (రూలు 118)

సభ చిత్తుచట్టాన్ని పరిశీలించిన తర్వాత, చిత్తు చట్టపు ప్రతిపాదక సభ్యుడు ఆ చిత్తు చట్టాన్ని ఆమోదించాలని ప్రతిపాదిస్తారు. ఆ ప్రతిపాదనను ఓటుకు పెట్టి సభానుమతిని పొందుతారు.

### చిత్తు చట్టాలకు ఆమోదముద్ర :

రాష్ట్ర ఉభయసభలూ చిత్తు చట్టాన్ని ఆమోదించిన తర్వాత దానిని గవర్నరు ఆమోదానికి పంపుతారు. గవర్నరు ఆ చిత్తు చట్టానికి తన ఆమోదాన్ని తెలియజేయవచ్చు లేదా నిలుపు చేయవచ్చు లేదా దానిని రాష్ట్రపతి పరిశీలనకై ప్రత్యేకింపవచ్చు. గవర్నరు తన సందేశంతో చిత్తుచట్టాన్ని లేదా అందలి ఏవేని అంశాలను పున: పరిశీలించాలని కోరుతూ త్రిప్పి పంపిన యెడల, ఉభయసభలూ దానిని ఆ విధంగా పున:పరిశీలన చేయాలి. ఉభయసభలూ ఆ చిత్తుచట్టాన్ని సవరణలతోగాని లేక సవరణలు లేకుండా గాని ఆమోదించి గవర్నరుకు తిరిగి సమర్పించినట్లయితే, గవర్నరు ఆ చిత్తుచట్టానికి తన ఆమోదాన్ని తెల్పుతారు. రాజ్యాంగంలో నిర్దేశించిన విధంగా గవర్నరు చిత్తు చట్టాన్ని రాష్ట్రపతి పరిశీలనకై ప్రత్యేకించిన యెడల, రాష్ట్రపతి ఆ చిత్తుచట్టానికి తన ఆమోదాన్ని యివ్వవచ్చు లేక దానిని నిలుపు చేయవచ్చు. చిత్తుచట్టాన్నిగాని లేదా దానిలోని ప్రత్యేక నిర్దేశాలను గాని పున: పరిశీలన చేయవలెనని సందేశంతో ఆ చిత్తు చట్టాన్ని ఉభయసభలకు త్రిప్పి పంపాలను ఆదేశంతో గవర్నరును రాష్ట్రపతి ఆదేశించవచ్చు. ఆ విధంగా తిరిగి వచ్చిన చిత్తుచట్టాన్ని రాష్ట్రపతి సందేశంలో పేర్కొన్నట్లు ఉభయసభలు ఆరునెలల్లో పున:పరిశీలించి సవరణలతోగాని లేక సవరణలు లేకుండా గాని ఆ చిత్తు చట్టాన్ని ఆమోదించి రాష్ట్రపతికి తిరిగి సమర్పిస్తారు. సందర్భానుసారంగా గవర్నరు లేదా రాష్ట్రపతి ఆమోదాన్ని పొందినమీదట, చిత్తుచట్టం చట్టంగా రూపొందుతుంది.



7

## ఆంధ్రప్రదేశ్
## శాసన సభ కార్య విధానం
## సంపుటి

## చట్ట నిర్మాణం




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.